క్లుప్తంగా

గణపర్తిలో నేడు గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



గణపర్తిలోని గౌరీపరమేశ్వరులు

మునగపాక: మండలంలోని గణపర్తిలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా కార్తీక మాసంలో ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. గౌరీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గౌరీ పరమేశ్వరులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సభ్యులు కోరారు.

వ్యాస రచన పోటీలో ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న నాగార్జున

కోటవురట్ల: శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అనకాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ప్రతిభ చూపాడు. భగవంతుడే నిజమైన స్నేహితుడు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాఠశాలకు చెందిన వేమవరపు నాగార్జున తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు.

ఆధార్ శిబిరం సందర్శన



ఆధార్ శిబిరంలో సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల: విద్యార్థులు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని ఆయన సందర్శించి సేవలపై ఆరా తీశారు. ఆధార్ సేవలు పారదర్శకంగా అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి విద్యార్థి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

పథకాలకు ఆధార్, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ తప్పనిసరి

అనకాపల్లి: సంక్షేమ పథకాలకు ఆధార్, ఎన్‌పీసీఐ మ్యాపింగ్ తప్పనిసరని అనకాపల్లి డివిజన్ తపాల శాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ చెప్పారు. కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్ అనుసంధానం లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందడం లేదన్నారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో 2.6 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా.. నేటి వరకూ 25,000 మంది తపాలశాఖలో ఎన్‌పీసీఐలో నమోదు చేసుకున్నారని చెప్పారు. మ్యాపింగ్ ద్వారా ఆధార్ సీడింగ్ చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు ప్రతి సచివాలయం పరిధిలో తపాల శాఖ ద్వారా ఐపీపీబీ అకౌంట్స్‌ను ఓపెన్ చేయటం, ఆధార్ అనుసంధానం వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

ఘనంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 198వ ఊంజల్ సేవ కార్యక్రమాన్ని శుక్రవారం మళ్ల అప్పలనాయుడు, ఇందిర దంపతులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి ఈ వేడుకను శాస్త్రోక్తంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, గౌరీ గీత మహిళా మండలి, గౌరీపరమేశ్వరి అమృత వర్షిని వ్యవస్థాపకురాలు పెతకంశెట్టి సుజాత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా మార్టు.. వెలవెల



అడ్డురోడ్డులో బోర్డు లేకుండా నిర్వహిస్తున్న మహిళా మార్ట్

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- గతంలో విక్రయాల జోరుతో లాభాల బాట



మార్టులో అసంపూర్తిగా ఉన్న సరకుల ట్రేలు

ఎస్.రాయవరం: పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో మండలంలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు వెలవెలబోతోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ ప్రస్తుతం పర్యవేక్షణ కొరవడడంతో నష్టాల వైపు పయనిస్తోంది. ఈ మార్ట్ ఏర్పాటు సమయంలో ఎస్.రాయవరం మండలంలోని 1800 సంఘాల సభ్యుల నుంచి రూ.250 చొప్పున వసూలు చేశారు. అలా సుమారు రూ.40 లక్షలకు పైగా వసూలు చేసి పెట్టుబడిగా పెట్టారు.

ఈ నిధులతో ఏర్పాటు చేసిన మార్టు కమిటీ పర్యవేక్షణలో నిర్వహణ చేసి, వచ్చిన లాభాలు ఏడాదికొకసారి సభ్యులకు పంచాలి. ప్రారంభంలో మార్ట్‌కు అవసరమైన సామగ్రిని ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించారు. రోజుకి రూ.60 నుంచి రూ.70 వేలు వరకు విక్రయాలు జరిగేవి. దీంతో కొంత లాభం కనిపిస్తూ మార్ట్ నిర్వహణ కొనసాగేది. ఈ లోగా ఎన్నికలు రావడంతో మార్ట్‌కు ఉన్న బోర్డును పాక్షికంగా తొలగించారు. తరువాత కొద్ది రోజులకు పూర్తిగా తీసేశారు. ప్రస్తుతం బోర్డు లేకుండానే మార్ట్ కొనసాగుతోంది. బోర్డు లేకపోవడంతో కొనుగోలుదారులు కూడా మార్టుకు రావడానికి ఆసక్తి కనబరచడం లేదు. దీంతో విక్రయాలు పడిపోతున్నాయి. వినియోగదారులకు అవసరమైన సరకులు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండడం లేదు. దీంతో మార్ట్‌లో కొనుగోళ్లు బాగా తగ్గిపోయాయి. మరోవైపు సిబ్బంది కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సరకులు అక్రమంగా పట్టుకెళ్లిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మార్ట్‌లపై దృష్టి అభివృద్ధికి కృషి చేయాలని స్వయం సహాయక సంఘం సభ్యులు కోరుతున్నారు.

మార్ట్‌లో విక్రయాలు తగ్గాయి..



మహిళా మార్టు నెలకు రూ.లక్ష లాభంతో నడుస్తోంది. విక్రయాలు మాత్రం తగ్గాయి. స్వయం సహాయక సంఘాల సభ్యులపై ఒత్తిడి చేయడం లేదు. ఇష్టం ఉన్నవారే మార్టులో సరకులు కొనుక్కోవచ్చు. బలవంతం లేదు. మార్టు అద్దె, ఇతర నిర్వహణ ఖర్చులకు సుమారు నెలకు రూ.50 వేలు ఖర్చు అవుతోంది. ఎన్నికల కారణంగా మార్ట్ బోర్డుకు ఉన్న గత ప్రభుత్వ నాయకుల బొమ్మలు తాత్కాలికంగా తొలగించాం. ఆ తరువాత వచ్చిన తుఫాన్‌కు బోర్డు పూర్తిగా ఎగిరిపోయింది. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం విధి విధానాలతో ఆదేశాలు రాకపోవడంతో బోర్డు ఏర్పాటు చేయలేదు. కొత్త సిబ్బందిని కూడా నియమిస్తాం. మార్టును లాభాల వైపు నడిపి, సభ్యులకు లాభాలు పంచుతాం.

– శివప్రసాద్, ఏపీఎం, ఎస్.రాయవరం

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



ఉత్తమ లేగ దూడలతో రైతులు, పశు వైద్యాధికారులు



ప్రదర్శనలో లేగ దూడలు

కోటవురట్ల: పశువుల్లో లింగ నిర్ధారణ వీర్యంతో సత్ఫలితాలు వస్తున్నాయని జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహక అధికారి డాక్టర్ బెహరా ప్రసాదరావు అన్నారు. బి.కె.పల్లిలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖల సౌజన్యంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బెహరా ప్రసాదరావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యం 60 శాతం రాయితీపై అందిస్తున్నారని తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ పెట్ల నరేష్ మాట్లాడుతూ వ్యాధి కారక సూక్ష్మక్రిములలో వృద్ధి చెందుతున్న క్రిమి సంహారక ఔషధాల నిరోధకతపై ప్రతి పాడి రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం లేగదూడలను పరిశీలించి ఉత్తమ దూడల రైతులకు ప్రోత్సాహకాలు అందించారు. ఈ శిబిరంలో ప్రదర్శించిన వివిధ జాతులకు సంబంధించి 42 లేగదూడలు ఆకట్టుకున్నాయి. 31 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. శిబిరంలో పాల్గొన్న ప్రతి రైతుకు మినరల్ మిక్చర్ దాణాను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ ఆర్.ప్రతాప్, సర్పంచ్ లింగన్నాయుడు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవకు సచివాలయ సిబ్బంది రావాల్సిందే

ఆదేశాలు జారీ చేసిన మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు

యలమంచిలి రూరల్: పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమానికి కొందరు సచివాలయ సిబ్బంది డుమ్మా కొట్టడంపై యలమంచిలి మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తీవ్రంగా పరిగణించారు. ఇకపై ఈ కార్యక్రమానికి హాజరు కాని సచివాలయాల సిబ్బందిపై సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. పురపాలక సంఘంలో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు ప్రతి శనివారం ఏదో ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, అధికారులు, పారిశుధ్య సిబ్బంది స్వచ్ఛత హీ సేవ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు సచివాలయ సిబ్బంది గైర్హాజరవుతున్నారు. దీంతో ఇకపై కార్యక్రమం జరుగుతున్న సచివాలయాల పరిధిలో ఇండోర్, అవుట్‌డోర్ ఉద్యోగులంతా తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేస్తూ ఆదేశాలు జారీచేశారు. శనివారం పట్టణంలోని ఫైర్ ఆఫీస్ కాలనీ, నెహ్రూ నగర్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు జరగనున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమానికి రెండు సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు. ఇకపై పట్టణ పరిధిలో నిర్వహించనున్న స్వచ్ఛత కార్యక్రమాలకు ఆయా సచివాలయాల పరిధిలో ఉద్యోగులు హాజరై, కార్యక్రమం ఫొటోలను తమ కార్యాలయానికి పంపించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గాల ఎన్నిక



కోటవురట్ల యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు



ఎన్నికైన నక్కపల్లి మండల యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు

కోటవురట్ల: మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. నర్సీపట్నంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కార్య దర్శి సతీష్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడుగా అడిగర్ల సత్యనారాయణ, అధ్యక్షుడుగా జె.నరసింగరావు, ప్రధాన కార్యదర్శిగా జె.వి. ప్రసాదరావు, కోశాధికారిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా ఎ.లోవరాజు, క్రాంతి, జిల్లా కౌన్సిలర్ గా చిట్టియ్యను ఎన్నుకుని ప్రకటించా రు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి తో కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

నక్కపల్లి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా డీవీకే శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా జి.మహేష్, కోశాధికారిగా కేవీ సత్యనారాయణ, ఉప అధ్యక్షుడిగా నాగమణి, శివయ్య, కార్యదర్శులుగా సూరిబాబు, ఆశాభాను, ఎం.ప్రశాంతి, వీవీఎం రాజేష్, జి.రాజు, గణేష్ చంద్ర, ప్రవీణ్‌కుమార్, హరిప్రసాద్, మోహన్, శంకర్రావు, దుర్గాప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులుగా జయరాజ్, శ్రీప్రతి, జిల్లా కౌన్సిలర్లుగా రాజబాబు, పి.వెంకటరావు, మాడెం సత్యనారాయణ, శ్రీకాంత్, ఉమాదేవి, ఎంజే నాయక్, టి.నానాజీ ఎన్నికయ్యారు.

'కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి'

అచ్యుతాపురం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసే విధంగా బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న కోరారు. మండలంలోని పూడి వైఎస్సార్ నగర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నిర్మాణంతో పాటు, మండల కమిటీలు వేయాలని సూచించారు. నియోజక వర్గాల సమన్వయకర్తలకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తనకాల అనంతరావు, చినబాబు, ఎం.చక్రవర్తి, ఎం.కోటేశ్వరరావు, కొండలరావు, ఎంవీఆర్ రాహుల్, పాలమరశెట్టి ఆదిమూర్తి, కాంగ్రేగుల సంజీవ్ పాల్గొన్నారు.

డ్రోన్‌లతో నిఘా



డ్రోన్ ఎగురవేస్తున్న పోలీసులు

నర్సీపట్నం: డ్రోన్‌లతో పట్టణంలో నిఘా పెట్టినట్టు పట్టణ సీఐ జి.గోవిందరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో డ్రోన్ ఎగురవేసి, నిఘా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలైన కొత్తవీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, పెదబొడ్డేపల్లిలలో డ్రోన్‌ల సహాయంతో నిఘా కట్టుదిట్టం చేశామన్నారు. నేరచరితుల కదలికలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు డ్రోన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. ప్రతి నిత్యం డ్రోన్‌ల ద్వారా పోలీసు పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు డ్రోన్ నిఘాను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మాదకద్రవ్యాల రవాణా, నేరచతలను కదిలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సైలు రమేష్, ఉమాశంకరరావు పాల్గొన్నారు.

40 శాతం రాయితీపై గడ్డి కోసే యంత్రాలు



పాడి రైతులకు గడ్డి కోసే యంత్రాలు అందిస్తున్న అధికారులు

కశింకోట: పాడి రైతులకు గడ్డి కోసే యంత్రాలను 40 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి కోరారు. మండలంలోని నూతలగుంటపాలెంలో శుక్రవారం ముగ్గురు పాడి రైతులకు గడ్డి కోసే యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాలతో గడ్డిని ముక్కలు చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. అటువంటి గడ్డిని వృథా చేయకుండా పశువులు పూర్తిగా తింటాయన్నారు. పశు గ్రాసాల కాండం పెద్దగా, లావుగా, ఆకులు వెడల్పుగా ఉండటం వల్ల వాటిని పశువులు పూర్తిగా తినలేవన్నారు. లేత ఆకులను తిని కాండాన్ని విడిచి పెడతాయన్నారు. ఇటువంటి గ్రాసాన్ని చిన్న ముక్కలుగా చేసి అందిస్తే 90 శాతం వరకు మేస్తాయన్నారు. రుచి కూడా పెరుగుతుందన్నారు. గడ్డి కోసే యంత్రం ధర రూ.33,790 అని, ప్రభుత్వం ఇచ్చే రాయితీ 40 శాతం పోనూ రైతు రూ.20,282 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పశు వైద్య సహాయకుడు బి.రాజేష్, కూటమి నాయకులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాలల పని వేళలు మార్చొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారావు

నక్కపల్లి: పాఠశాలల పనివేళలు మార్చడానికి వీల్లేదని, ప్రస్తుతం ఉన్న పని వేళలనే కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ ధర్మారావు డిమాండ్ చేశారు. శుక్రవారం నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పని వేళల విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. తక్షణమే ఐఆర్ ప్రకటించాలన్నారు. పీఆర్‌సీ కమిషన్ నియమించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక అంశాలతో కూడిన పెండింగ్ బిల్లులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. త్వరలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న పాకలపాటి పాకలపాటి రఘువర్మకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ డి.కొండలరావు, మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, గౌరవాధ్యక్షుడు ఫాల్గుణరావు, ఉపాధ్యక్షుడు నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకే ప్రభుత్వాలు అనుకూలం



అచ్యుతాపురం సంతలో కర పత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ నేతలు

అచ్యుతాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న అనకాపల్లి నెహ్రూ చౌక్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ సోమునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం అచ్యుతాపురం సంతలో ప్రచారం చేస్తూ కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కౌలు రైతులకు యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ఉత్తర్వులు రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలోని కూటమి సర్కారు కూడా ఇదే తరహాలో పాలిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, ఐద్వా మండల కనీనర్ ఆర్.లక్ష్మి, నూకరాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన ఉండాలి



గ్యాస్ సిలిండర్‌లో మంటలు అదుపు చేయడంపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ టీమ్

ఎస్.రాయవరం: ప్రకృతి వైపరీత్యాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని తహసీల్దార్ జె.రమేష్ బాబు అన్నారు. అడ్డురోడ్డు శ్రీఆదర్శ పబ్లిక్ స్కూల్‌లో ఎన్‌డీఆర్‌ఎఫ్ టీమ్ ప్రకృతి వైపరీత్యాలపై మాక్‌డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. మానవ తప్పిదాలు, ప్రకృతి పరంగా సంభవించే వైపరీత్యాల నుంచి మనల్ని మనం రక్షించుకుంటూ, తోటి వారికి ఎలా సహాయం అందివ్వాలనే సంఘటనలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. సిబ్బంది విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో అన్ని పాఠశాలల విద్యార్థులకు ఈ అవగాహన చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ టీమ్ కమాండర్ వై.సత్యనారాయణ, ఫైర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణరావు, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో ఫ్రైడే డ్రైడే



తిమ్మాపురం అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం: ఇళ్లలో నిల్వ నీటిని తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పెనుగొల్లు హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఆదినారాయణ అన్నారు. తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. పలువురు నివాసాలకు వెళ్లి అవగాహన కల్పించారు. రుబ్బు రోళ్లు, ఫ్రిజ్ తొట్టెలు, తాగిన కొబ్బరి బొండాలు, టైర్లలో దోమలు ఎక్కువగా ఉత్పత్తి చెందుతాయని సూచించారు. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు.

భగవద్గీత పఠనం చాలా అవసరం



భగవద్గీత పారాయణం చేస్తున్న నూకరాజును సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం భగవద్గీత అని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు అన్నారు. మునగపాక లింగరాయి గుడిలో ఏటా ప్రజల్లో భక్తి భావాలు పెంచేందుకు ఎంతో కృషి చేస్తున్న భగవద్గీత పారాయణకుడు తేలు నూకరాజును శుక్రవా రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించా రు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీతపై అవగాహన పెంచుకుని, ధర్మ పరిరక్షణకు పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అనకాపల్లి డివిజన్ ధర్మ ప్రచారకుడు గిన్నె మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల్లో ప్రమాద ఘంటికలు



చౌడువాడ రహదారిలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

కోటవురట్ల: రహదారుల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. సుమారు ఏడాదిగా జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో ప్రమాదాలతో వాహనచోదకులు బెంబేలెత్తుతున్నారు. రహదారులకిరువైపులా దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలతో మలుపుల్లో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అన్నవరం, రాజుపేట, చౌడువాడ, నీలిగుంట, లింగాపురం, గొట్టివాడ, పందూరు, నర్సీపట్నం–రేవుపోలవరం మెయిన్‌రోడ్డులో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. అధికారులు స్పందించి తుప్పలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఏడాకుల చెట్లు తొలగించాలని వినతి



తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న అప్పలరాజు

ఎస్.రాయవరం: గ్రామాలను ఆనుకుని జాతీయ రహదారిపై ఉన్న ఏడాకుల చెట్లను తొలగించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఎం.అప్పలరాజు కోరారు. ఈ మేరకు ఆయన తహసీల్దార్ జె.రమేష్‌బాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పి.ధర్మవరం గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెట్ల నుంచి వాసన పీల్చడం వల్ల మనుషులు ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోందన్నారు. ఈ మేరకు తహసీల్దార్ స్పందిస్తూ ఈ చెట్ల వల్ల నష్టం ఉందని తెలిసిందని, జాతీయ రహదారి అధికారులకు నివేదిక ఇచ్చి తొలగించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రమాదకరంగా తోటాడ రోడ్డులో మలుపులు



తోటాడ రోడ్డులో ప్రమాదకరంగా మలుపు

మునగపాక: మండలంలోని తోటాడ రోడ్డు పలు చోట్ల మలుపులతో ప్రమాదకరంగా మారింది. ఎక్కడ చూసినా మలుపులే దర్శనమిస్తున్నాయి. అనకాపల్లి నుంచి పరవాడకు వెళ్లేందుకు ఇదే మార్గం కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ మార్గంలో మలుపులు ఎక్కువగా ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొన్ని మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే పరిస్థితులు లేవు. అధికారులు స్పందించి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు .